

సాక్షి గుంటూరు

బుధవారం । 8 । నవంబర్ । 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 524.70 అడుగుల వద్ద ఉంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 26,509 వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 4610 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 2180 క్యూసెక్కులు వదిలారు.

అభయ ప్రదాయినిగా అమ్మవారు



పిట్టలవానిపాలెం : చందోలులోని బగళాముఖ అమ్మవారి దేవాలయంలో మంగళవారం హరిద్ర శృంగార్చన పూజ నిర్వహించారు. వివాహం కాని ఆడపిల్లల కోసం అమ్మవారికి ఈ పూజలు చేస్తారు.

న్యూస్‌రీల్

ఎన్‌సీసీ కోసం విద్యార్థినుల ఎంపిక



తెనాలి: ఎన్‌సీసీ 10వ ఆంధ్రా బాలికల బెటాలియన్‌లోకి ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపికను మంగళవారం స్థానిక జేఎంజే మహిళా కాలేజీలో నిర్వహించారు. ఆసక్తి గల డిగ్రీ ఫస్టియర్ విద్యార్థినులకు శారీరక పరీక్షల్లో భాగంగా పరుగు పోటీలు జరిపారు. అనంతరం పలువురు విద్యార్థినులను ఎంపిక చేశారు. కాలేజి దశలో విద్యార్థినుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు ఎన్‌సీసీ బాగా ఉపకరిస్తుందని ఈ సందర్భంగా ఎన్‌సీసీ అధికారి వై.శారా సూసన్ అన్నారు. వ్యక్తిగత జీవితంలో క్రమశిక్షణ, శారీరక దృఢత్వం అలవడుతుందని చెప్పారు. కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైనీ కేపీ, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ మేరీ శారద పాల్గొన్నారు.

బ్యాక్‌లాగ్ ఉద్యోగాల ఫైనల్ మెరిట్ జాబితా విడుదల

నెహ్రూనగర్: విభిన్న ప్రతిభావంతుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాలకు సంబంధించిన ఫైనల్ మెరిట్ జాబితా విడుదల చేసినట్లు విభిన్న ప్రతిభావంతుల, ట్రాన్స్‌జెండర్స్, వృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సువార్త మంగళవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. వివిధ శాఖల్లో 2022–23 సంవత్సరానికి విభిన్న ప్రతిభావంతులు(దృష్టి లోపం) గల దివ్యాంగుల కేటగిరీలకు సంబంధించిన ఆఫీస్ సబార్డినేట్, వాచ్‌మెన్ కం–హెల్పర్, నైట్ వాచ్‌మెన్, బంగ్లా వాచర్, స్కావెంజర్, బేరర్ మొదలగు విభిన్న ప్రతిభవాంతుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాల ఫైనల్ మెరిట్ జాబితాను జిల్లా అధికారిక వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.గుంటూరు.ఏపీ.జీఓవీ.ఇన్ నందు, బృందావన్‌గార్డెన్స్‌లోని సంక్షేమ శాఖ కార్యాలయంలో నోటీసు బోర్డు నందు ఉంచడం జరిగిందన్నారు.

జీజీహెచ్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష సమాచార కేంద్రం



గుంటూరు మెడికల్ : గుంటూరు జీజీహెచ్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష సమాచార కేంద్రాన్ని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ జిల్లాల నుంచి వచ్చిన రోగుల ఆరోగ్యంపై సమాచారం ఇవ్వడంతోపాటు, వారికి వైద్య పరీక్షలు జరిగే విధంగా చర్యలు చేపట్టామన్నారు. అర్బన్, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన రోగులకు సమాచార కేంద్రంలో వివిధ పరీక్షలు చేసి అవసరమైన వార్డుకు రిఫర్ చేస్తామన్నారు. సమాచార కేంద్రంలో ఒక వైద్యుడు, ఫార్మాసిస్టు, నర్సింగ్ సిబ్బంది, ఒక ఏఆర్ఎంఓ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే రోగులను రిఫరల్ ఆసుపత్రికి వెళ్లేందుకు రూ. 500 లు ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. ప్రతి మొబైల్‌లో ఆరోగ్య శ్రీ యాప్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని చెప్పారు. ఈ యాప్ ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశ సజని, అడ్మినిస్ట్రేటర్ బి.ప్రవీణ్ కుమార్, ఆరోగ్య శ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ నాగ్ల జయరామకృష్ణ పాల్గొన్నారు.

ఒరిజినల్ మెరిట్ లిస్టు విడుదల

గుంటూరు మెడికల్ : ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త కార్యాలయం పరిధిలో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నవారి ప్రొవిజనల్ మెరిట్ లిస్టును మంగళవారం విడుదల చేసినట్లు జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ సుబ్రహ్మణ్యరాజు తెలిపారు. ప్రొవిజనల్ మెరిట్ లిస్టులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయం ప్రాంగణంలోని తమ కార్యాలయంలో నేరుగా అందజేయాలన్నారు. ప్రొవిజనల్ మెరిట్ లిస్టును గుంటూరు.ఏపీ.జీవో.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు.

యార్డులో 31,690 బస్తాల మిర్చి అమ్మకాలు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 30,319 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 31,690 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,200 నుంచి 24,000 వరకు లభించింది.



వినుకొండలో జరిగిన సామాజిక సాధికార పాదయాత్రకు తరలివచ్చిన జనసందోహం



డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి రజిని, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

సామాజిక జైత్రయాత్ర

పల్నాడు జిల్లా వినుకొండలో కదంతొక్కిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు

- వినుకొండలో వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార యాత్రకు విశేష స్పందన
- వేలాదిగా తరలివచ్చి సంఘీభావం తెలిపిన బడుగు, బలహీనవర్గాలు
- అడగడుగునా ఘనస్వాగతం
- దేవాలయాల్లో పూజలు, మహాత్ముల విగ్రహాలకు నివాళులు
- విఠంరాజుపల్లి నుంచి పాదయాత్ర
- బహిరంగ సభకు తరలివచ్చిన ప్రజలు

సాక్షి, నరసరావుపేట: స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు నేతృత్వంలో పల్నాడు జిల్లా వినుకొండలో జరిగిన వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార యాత్ర వినుకొండ రూరల్ మండలం విఠంరాజుపల్లి నుంచి మంగళవారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైంది. వేలాది మంది ప్రజలు, పార్టీనేతలు యాత్రకు స్వాగతం పలికారు. రాజ్యసభ సభ్యులు, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వి.విజయసాయిరెడ్డి, మంత్రులు మేరుగ నాగార్జున, ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్సీలు కుంభా రవి, చంద్రగిరి ఏసురత్నం, పోతుల సునీత, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి పాదయాత్రలో పాల్గొన్నారు. దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి పాదయాత్రగా ప్రజలను కలుస్తూ వినుకొండ వైపు యాత్ర సాగింది. నాగిరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజలు చేశారు. అక్కడి నుంచి పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం దగ్గర్లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, గుర్రం జాషువా, జగ్జీవన్‌రాం విగ్రహాలకు ప్రజాప్రతినిధులు, నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తరువాత యాత్ర కొనసాగిస్తూ శివయ్య స్థూపం సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభ వరకు యాత్ర సాగింది. పాదయాత్రలో బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో నడిచి తమ సంఘీబావం తెలిపారు. ముఖ్యంగా మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అడుగడుగునా ప్రజలు పూలవర్షంతో స్వాగతం పలికారు. యాత్రకు వచ్చిన నేతలకు వినుకొండ నేతలు గజమాలతో, ఫ్లెక్సీలతో స్వాగతం పలికారు.



బస్సు యాత్రలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు



నేతలను గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

మార్మోగిన జగన్నామ స్మరణ...

పట్టణంలోని శివయ్య స్థూపం సెంటర్‌లో ఏర్పాటుచేసిన సామాజిక సాధికార బహిరంగ సభకు భారీ స్థాయిలో జనసందోహం తరలివచ్చింది. ముఖ్యంగా మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సామాజిక న్యాయానికి జనం నీరాజనాలు పలికారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు, మహిళలకు వైఎస్సార్ సీపీ చేసిన మేలును మంత్రులు, నేతలు వివరించారు. ఆ ప్రసంగాలను ప్రజలు ఆసక్తిగా విన్నారు. ప్రసంగాల్లో జననేత జగనన్న పేరు వినగానే ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. ముఖ్యంగా '' మా నమ్మకం నువ్వే జగన్...'', '' జగన్ రావాలి– జగనే కావాలి'', '' వై నాట్ 175 '' అంటూ జనం ప్రతిస్పందించారు. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజిక పరంగా జరిగిన మేలును ప్రజలు గుర్తు చేసుకున్నారు. తమకు జరిగిన సామాజిక న్యాయాన్ని ప్రతిధ్వనించారు. బహిరంగ సభలో మంత్రులు ఆదిమూలపు సురేష్, విడదల రజిని, మేరుగ నాగార్జున, ఎంపీలు విజయసాయిరెడ్డి, లావు శ్రీకృష్ణదేవరాయలు, సినీ నటుడు అలీ, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు చంద్రగిరి యేసురత్నం, కుంభా రవిబాబు, పోతుల సునీత, ఎమ్మెల్యేలు బొల్లా బ్రహ్మనాయుడు, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి, ఇతర నేతలు పాల్గొన్నారు.

సాధికారతను చేతల్లో చూపిన నాయకుడు జగన్



చరిత్రలో మరే నాయకుడు చూపని సామాజిక సాధికారతను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతల్లో చూపాడని మంత్రి విడదల రజిని అన్నారు. 139 బీసీ కులాలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటుచేసిన ఘనత వైఎస్సార్ పీకే దక్కుతుందన్నారు. నరసరావుపేట పార్లమెంట్ పరిధిలో తొలిసారి ఓ బీసీ మహిళకు మంత్రి పదవీ కేటాయించి మహిళా పక్షపాత ప్రభుత్వమని నిరూపించారన్నారు. గత ప్రభుత్వ పాలనను జగనన్న పాలనతో పోల్చి చూసి వైఎస్సార్ పీకే ఓటు వేయాలన్నారు. గతంలో ఎన్నడూ జరగని విధంగా వినుకొండలో అభివృద్ధి జరిగిందని అన్నారు. జగనన్న ప్రభుత్వం మళ్లీ రావాలంటే వినుకొండ ఎమ్మెల్యేగా బొల్లా బ్రహ్మనాయుడిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు.

–విడదల రజిని, మంత్రి

జగనన్న పాలనలోనే అభివృద్ధి



జగనన్న పాలనలోనే వినుకొండలో అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. 100 పడకల ఆసుపత్రి, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం, రామలింగేశ్వర ఘాట్ నిర్మాణం, దేవాలయ అభివృద్ధి జరిగాయన్నారు. ఇది అభివృద్ధి కాదని నిరూపిస్తే తాను వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనని బొల్లా సవాలు విసిరారు. టీడీపీ నేత చంద్రబాబు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రజల సొమ్ము దోచుకునేందుకే సమయం కేటాయించారన్నారు.

–బొల్లా బ్రహ్మనాయుడు, ఎమ్మెల్యే, వినుకొండ

వడ్డెర్ల కల నిజం చేసిన జగన్



స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత వడ్డెర్లకు చట్టసభల్లో తొలిసారి స్థానం కల్పించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం అన్నారు. 2019లో ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం ఇవ్వడంతోపాటు ఓడిన తర్వాత గుంటూరు మార్కెట్ యార్డుకు మూడున్నర సంవత్సరాలు చైర్మన్‌గా పదవి కల్పించారన్నారు. తర్వాత ఎమ్మెల్సీ చేసి వడ్డెర్లకు కలగా మిగిలిన చట్టసభల్లో ప్రవేశం కల్పించారన్నారు.

–చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్సీ

బడుగులకు గౌరవంతోపాటు పదవులు



బడుగులకు సామాజికంగా గౌరవంతోపాటు పదవులు ఇచ్చిన వ్యక్తి జగనన్న అని ఎమ్మెల్సీ పోతుల సునీత అన్నారు. 2014–19 పాలనతో పోల్చితే ఈ ప్రభుత్వం ఎంత గొప్పదో తెలుస్తుందన్నారు. 156 బీసీ కులాలకు 56 కార్పొరేషన్లు ఇచ్చిన చరిత్ర వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదన్నారు. ఇటువంటి ప్రభుత్వాన్ని 175 స్థానాల్లో గెలిపించాల్సిన బాధ్యత మనందరిమీద ఉందన్నారు.

–పోతుల సునీత, ఎమ్మెల్సీ

సగర్వంగా బతుకుతున్నారు...



నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ అంటూ వారి సంక్షేమానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్న ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందని ఎమ్మెల్సీ కుంభా రవిబాబు అన్నారు. చరిత్రలో బడుగు బలహీన వర్గాలు ద్వితీయ శ్రేణి పౌరులుగా ఉన్నారని, అణచివేతకు గురయ్యారన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో సగర్వంగా బతుకుతున్నారన్నారు. ప్రతి పేదింటి బిడ్డకు నాణ్యమైన చదువులు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు.

–కుంభా రవిబాబు, ఎమ్మెల్సీ

రైతుల జీవన ప్రమాణాలు మెరుగు

- రైతులకు భరోసా
- జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి
- 1,26,030 మంది రైతుల ఖాతాల్లో రూ.51.60 కోట్లు జమ
- హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లా రైతులు

గుంటూరు వెస్ట్ : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నవరత్న సంక్షేమ పథకాలు రూపొందించిన రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా దూసుకుపోతుందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి అన్నారు. మంగళవారం శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో నిర్వహించిన వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ పథకం ఐదో సంవత్సరం రెండో విడత నగదు జమ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు వర్చువల్ విధానంలో వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రైతు భరోసా, ఆర్బీకేలు, ఆశాజనకమైన మద్దతు ధర, చక్కని మార్కెటింగ్ తదితర పద్ధతుల కారణంగా రైతుల జీవన ప్రమాణాలు చాలా వరకు మెరుగయ్యాయన్నారు. ఈ పథకం ద్వారా 1,26,030 మందికి రూ.51.60 కోట్లు నేరుగా వారి ఖాతాల్లోకి జమ చేశారన్నారు. ఈ పథకం కింద జిల్లాలో ఇప్పటి వరకు జిల్లా రైతాంగానికి రూ.769 కోట్లు అందాయన్నారు. ఆ నగదును రైతులు పెట్టుబడికి, వ్యవసాయ ఉత్పత్తులకు ఉపయోగించుకోవాలని కలెక్టర్ వివరించారు. అనంతరం కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాల్‌పురం రాము), రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ ఆబిదా బేగం, జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేశారు. లబ్ధిదారుల అభిప్రాయాలు



నమూనా చెక్కు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ సీతారామాంజనేయులు తదితరులు

భరోసా కల్పించారు



గతంలో రైతులు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యారు. ఈ ఐదేళ్ల కాలంలో అనేక సంక్షేమ పథకాలు అందించడం, ముఖ్యంగా కరోనా కష్టకాలంలో ఏం చేయాలో తెలియని రైతులకు ఉచితంగా ఆన్‌లైన్‌లో డబ్బులు వేసి ఆదుకున్న తీరు అద్భుతం. మిర్చి, వరి, పొగాకు, పత్తి వంటి పంటలకు మద్దతు ధర పెంచడం బాగుంది...

వంగా నవీన్‌రెడ్డి, రైతు, జొన్నలగడ్డ

కౌలు రైతుల గురించి ఆలోచిస్తున్నారు..



ప్రతిసారీ పెట్టుబడికి ఇబ్బంది పడాల్సి వచ్చేది. ఈ ప్రభుత్వ కౌలు రైతుల గురించి కూడా ఆలోచిస్తోంది. సాయం చేస్తున్నారు. ఐదేళ్ల నుంచి రైతు భరోసా పథకం కింద డబ్బులు అందుతున్నాయి. దీంతోపాటు పంటల బీమా కూడా అందింది. నా భార్యకు అమ్మ ఒడి, ఇంటి స్థలం వచ్చాయి. మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రిగా చూడాలనుకుంటున్నాం...

–చిలకా శౌరీలు, కౌలు రైతు వింజనంపాడు.

అబలకు అండ

- రంగంలోకి 'మహిళా పోలీసులు'
- పోలీస్ పహారాలో గుంటూరు నగరం
- ప్రతిరోజు సాయంత్రం ఫుట్‌పెట్రోలింగ్
- మహిళల రక్షణపై ఐజీ పాలరాజు ప్రత్యేక దృష్టి

సాక్షి ప్రతినిధి, గుంటూరు : గుంటూరు నగరంలో మహిళలకు అండగా 'మహిళా పోలీసులు' అనే కొత్త కార్యక్రమానికి గుంటూరు రేంజి ఐజీ జి.పాలరాజు బుధవారం నుంచి శ్రీకారం చుట్టనున్నారు. ఇప్పటికే విజిబుల్ పోలీసింగ్ పేరుతో ప్రతిరోజూ రాత్రి పూట గస్తీ ముమ్మరం చేశారు. అదే తరహాలో మహిళలకు రక్షణ కల్పించే విధంగా మహిళా సిబ్బందితో సాయంత్రం నాలుగు గంటల నుంచి తొమ్మిది గంటల వరకూ ఫుట్‌పెట్రోలింగ్ నిర్వహించనున్నారు. మహిళలకు రక్షణ లేదనిపించే ప్రదేశాలు, ముఖ్యంగా రద్దీ ఎక్కువ ఉండి ఈవ్‌టీజర్స్ బెడద ఉన్నట్లు భావించే ప్రాంతాలు, దేవాలయాలు, చర్చిలు, మాల్స్ ఉన్న ప్రాంతాలలో ఈ ఫుట్‌పెట్రోలింగ్ నిర్వహిస్తారు. గుంటూరు నగరంలో మహిళా హోంగార్డులు, మహిళా కానిస్టేబుళ్లు, ఎస్ఐలు, సీఐలు 102 మంది వరకు ఉన్నారు. వీరిని పది బృందాలుగా చేసి ప్రతి బృందం ఒక్కో ప్రాంతంలో ఫుట్‌పెట్రోలింగ్ చేసేలా ఆదేశాలు జారీ చేశారు. వీరు ఆయా ప్రాంతాలలో తిరుగుతూ మహిళలతో మాట్లాడతారు. మహిళలను వేధించే ఈవ్‌టీజర్స్ ఉంటే వారిని పట్టుకుని వారిపై ఈవ్‌టీజింగ్ షీట్ తెరుస్తారు.



రాత్రి వేళ గస్తీ ముమ్మరం...

ఇప్పటికే రాత్రి వేళల్లో గస్తీని ముమ్మరం చేసిన పోలీసులు రాత్రి 12 నుంచి మూడు గంటల వరకు బైక్ రేసింగ్‌లు చేస్తున్న వారిని పట్టుకుని 26 బైక్‌లను సీజ్ చేశారు. రాత్రి 12 తర్వాత రోడ్లపై ఎవరు కనపడినా వారు ఎందుకు వచ్చారు? ఏ పనిమీద వచ్చారు. ఎక్కడికి వెళ్తున్నారు వంటి వివరాలు తెలుసుకోవడంతోపాటు వారి బైక్ నెంబర్, ఫోన్ నెంబర్‌ను నమోదు చేసుకుంటున్నారు. గత ఐదురోజుల్లో 12 వందల మందిని ప్రశ్నించి వారి వివరాలను నమోదు చేసుకున్నారు. వీరిలో క్రిమినల్ రికార్డు ఉన్న కొందరు దొరకగా వారిపై కేసులు నమోదు చేశారు. గుంటూరు నగరంలో అందరికీ రక్షణ ఉందనే విషయాన్ని చెప్పడం కోసమే ఈ చర్యలు చేపడుతున్నట్లు ఐజీ పాలరాజు తెలిపారు. మహిళల రక్షణ విషయంలో అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఇప్పటి వరకు రేంజ్‌లో దిశ చట్టం కింద నమోదు చేసిన కేసుల్లో 37 కేసుల్లో శిక్ష పడేలా చూశామని 'సాక్షి'కి తెలిపారు. ఇందులో 13 మందికి జీవిత ఖైదు పడగా, మిగిలిన వారికి ఏడు నుంచి 20 సంవత్సరాల వరకు శిక్ష పడిందన్నారు.

పురుగు మందుల గోడౌన్‌లో తనిఖీలు

రెండు కంపెనీలకు వ్యవసాయాధికారులు నోటీసులు జారీ



పురుగు మందుల గోడౌన్‌లో నిల్వలను నమోదు చేస్తున్న వ్యవసాయ అధికారులు

పెదకాకాని: ప్రభుత్వం నిషేధించిన పురుగు మందులు నిల్వ చేసిన గోడౌన్‌లో వ్యవసాయ అధికారులు తనిఖీలు చేశారు. గుంటూరు ఆటోనగర్‌లోని గోడౌన్‌లో నిషేధిత పురుగు మందులు మోనోక్రొటోఫాస్ కోరమండల్, మోనోక్రొటోఫాస్ వివా క్రాప్ సైన్స్ నిల్వలు ఉన్నట్లు అధికారులకు సమాచారం అందింది. కమిషనర్ కార్యాలయ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎ. మద్దులేటి ఆధ్వర్యంలో మంగళవారం గోడౌన్‌ను తనిఖీ చేశారు. నిషేధిత పురుగు మందుల నిల్వల్ని పరిశీలించారు. మోనోక్రొటోఫాస్ కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ పేరుతో 7060 లీటర్లు, మోనోక్రొటోఫాస్ వివా క్రాప్ సైన్స్ పేరుతో 450 లీటర్లు ఉన్నట్లు గుర్తించారు. వాటి విలువ రూ. 40,73,322గా అంచనా వేశారు. ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకులు ఎ. మద్దులేటి మాట్లాడుతూ భారత ప్రభుత్వం ఈ ఏడాది సెప్టెంబరు 29న మోనోక్రొటోఫాస్ 36 శాతం ఎస్‌ఎల్ పురుగు మందు తయారీని నిషేధించినట్లు చెప్పారు. అక్టోబరు 23న తయారైన ఈ రెండు కంపెనీల నిల్వలను గోడౌన్‌లో గుర్తించి, వాటి అమ్మకాల్ని నిలుపుదల చేసినట్లు తెలిపారు. ఆయా కంపెనీలకు షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో గుంటూరు అర్బన్ వ్యవసాయ అధికారి బి. అంజిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల తుది జాబితాలో లోపాలుండకూడదు

జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి

గుంటూరు వెస్ట్: ఓటర్ల జాబితాలో లోపాలుండకూడదని, ఫైనల్ డ్రాఫ్ట్ విడుదలయ్యేలోపే సమస్యలన్నీ పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మంగళవారం నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. డోర్ నంబర్ లేని వాటిని, సున్నా డోర్ నంబర్ వాటిని, స్థల యజమాని, గ్రామం పేరుతో ఉన్న డోర్ నంబర్లు (జంక్ క్యారెక్టర్లు), వందేళ్లు నిండిన ఓటర్ల వివరాల్ని బీఎల్వోలు, ఈఆర్వోలు విచారించి తుది జాబితాను త్వరగా సమర్పించాలని చెప్పారు. ఒకే డోర్ నంబర్‌పై పది మందికి మించి ఉన్న ఓటర్ల వివరాలు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. ప్రజాప్రతినిధులు ఇచ్చే అభ్యంతరాలు, ఫిర్యాదుల్ని ఎన్నికల సంఘం వెలువడించిన మార్గదర్శకాలకు లోబడి పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో చంద్రశేఖరరావు, గుంటూరు ఆర్డీవో పి.శ్రీకర్, అధికారులు పాల్గొన్నారు.

ఎంటీఎం కమిషనర్ బదిలీ

మంగళగిరి: మంగళగిరి – తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ యు.శారదాదేవి బదిలీ అయ్యారు. ఈ మేరకు మంగళవారం రాత్రి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె స్థానంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌లో పనిచేస్తున్న నిర్మల్‌కుమార్ ఎంటీఎం కమిషనర్‌గా నియమిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

మెడికల్ ఆఫీసర్స్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం పరిధిలో డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో, నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రాంలో మెడికల్ ఆఫీసర్స్ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీబీఎస్ విద్యార్హత ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ. 61,960 రెమ్యూనరేషన్ చెల్లిస్తారని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు ఈనెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలు ఒక సెట్‌తో గుంటూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో జరిగే వాక్ ఇన్ ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఆయన సూచించారు.

హత్య కేసులో నలుగురికి మూడేళ్లు కఠిన కారాగార శిక్ష

రూ.2 వేలు జరిమానా

నగరంపాలెం: 2016లో జరిగిన హత్య కేసులో నలుగురికి మూడేళ్ల కఠిన కారాగార జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ గుంటూరు జిల్లా రెండో అడిషనల్ జడ్జి మంగళవారం తీర్పు వెలువరించారు. వివరాల్లోకి వెళ్తే..పెదకాకాని పోలీస్‌స్టేషన్ పరిధిలో 2016లో జరిగిన ఓ హత్యపై క్రైం నంబర్ 49/2016 యు/ఎస్ 302, 324, 323, 506 ఐపీసీ కింద కేసు నమోదైంది. నిందితులైన పల్నాడు జిల్లా గురజాల మండలం జంగమేశ్వరపాడుకి చెందిన పాశం వెంకటేశ్వరరావు, నల్లగోర్ల కొండలు, మంచి కృష్ణ, తండా లాలు అనే నలుగురు ముద్దాయిలకు మూడేళ్లు కఠిన కారాగార జైలు శిక్ష, రూ.2000 జరిమానా విధిస్తూ రెండో జిల్లా జడ్జి తీర్పు వెల్లడించారు. గతంలో సీఐగా విధులు నిర్వహించిన స్వర్గీయ శేషారావు దర్యాప్తు చేపట్టారు. నిందితుల్ని అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో అభియోగ పత్రాల్ని దాఖలు చేశారు. పోలీస్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ మధుసూదనరావు వాదనలు వినిపించగా, పెదకాకాని పోలీసులు, కోర్టు మానిటరింగ్ సెల్ సాక్షుల్ని కాలంలో హాజరుపరిచారు. నిందితులకు శిక్ష పడేలా దర్యాప్తు చేపట్టిన పోలీస్, ప్రాసిక్యూషన్ అధికారుల్ని గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు, గుంటూరు జిల్లా ఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ అభినందించారు.

ఇంజినీరింగ్ అధికారులకు నోటీసులు

- సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు
- కాంట్రాక్టర్‌కు కాపాడేందుకు అధికారుల యత్నం
- కమిషనర్ కీర్తి చేకూరి సీరియస్
- రోడ్డు పునర్నిర్మాణం చేయాలని ఆదేశాలు



సినీ ప్రైమ్ థియేటర్ పక్కన వేసిన నాసి రకం సీసీ రోడ్డు

నెహ్రూనగర్: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో యూజీడీ పనుల్ని క్రమపద్ధతిలో చేయకపోవడంతో గుంటూరు నగరంలోని రోడ్లన్నీ గుంతల మయంగా మారాయి. 2019లో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏర్పడిన పాలకవర్గం రోడ్లన్నింటినీ బాగు చేసుకుంటూ, అవసరమైన చోట్ల కొత్తవి వేస్తూ నగరాభివృద్ధికి ఎంతో కృషి చేస్తోంది. రూ.350 కోట్లతో సీసీ రోడ్లు, ఇతర రోడ్లు వేస్తున్నారు. అయితే, అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని స్పష్టమైన ఆదేశాలున్నప్పటికీ ఇంజినీరింగ్ అధికారుల కక్కుర్తితో పాటు కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. నాణ్యత ప్రమాణాలకు తిలోదకాలు వదిలేస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

వివరాల్లోకి వెళితే....

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని 18వ డివిజన్ జీటీ రోడ్డు సినీ ప్రైమ్ థియేటర్(పాత విజయలక్ష్మి థియేటర్) పక్కనే రూ. 35,37,310 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ టెండర్‌ను గత సంవత్సరం ఆగస్టు 1న ఓ బడా కాంట్రాక్టర్ దక్కించుకున్నారు. నిర్మాణం చేపట్టిన కొద్ది నెలల్లోనే రోడ్డంతా బీటలు పడటంతో క్వాలిటీ కంట్రోల్ చేయాలని కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాలు జారీ చేశారు. విజయవాడలోని వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ సివిల్ వర్క్స్ కన్సల్టెన్సీ డీన్‌ను క్వాలిటీ కంట్రోల్ చేయాలని అధికారులు కోరారు. డీన్ ఈ సంవత్సరం ఫిబ్రవరిలో కోర్ కట్ ద్వారా క్వాలిటీ కంట్రోల్ టెస్ట్ చేశారు. అగ్రిమెంట్ సమయంలో అధికారులు కోర్ కట్ ఎం 30 (కాంక్రీట్ కోర్) ఎస్టిమేషన్ వేశారు. తీరా క్వాలిటీ కంట్రోల్ చెక్ చేసినప్పుడు ఎం 30కి గాను 14.38గా తేలింది. మూడు సార్లు అదే రోడ్డులో మూడు చోట్ల క్వాలిటీ కంట్రోల్ చెక్ చేశారు. కాంక్రీట్ కోర్ ఒక చోట 13.62, మరో చోట మరి దారుణంగా 9.25 వేయడంపై కమిషనర్ సీరియస్ అయ్యారు. విషయం తెలుసుకున్న కాంట్రాక్టర్ బిల్లు పెట్టకుండా అలాగే వదిలేశారు.

ఇంజినీరింగ్ అధికారులకు నోటీసులు

నగర కమిషనర్ కీర్తి చేకూరి సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ఇతర అంశాల్లో అధ్యాయం చేసేందుకు గాను గత నెల 29 నుంచి నవంబర్ 5వ తేది వరకు విదేశీ పర్యటనకు వెళ్లారు. వెళ్లే ముందు కాంట్రాక్టర్‌తో పాటు ఇంజినీరింగ్ అధికారులు నోటీసులు జారీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే, వీటిని కూడా అమలు చేయకుండా ఇంజినీరింగ్ అధికారులు తాత్సారం చేయడంతో విషయం తెలుసుకున్న కమిషనర్ ఎస్ఈ(ఇంజినీరింగ్ సూపరింటెండెంట్‌పై) సీరియస్ అయ్యారు. హుటాహుటిన ఇంజినీరింగ్ అధికారులకు షోకాజ్ నోటీసులతో పాటు, కాంట్రాక్టర్‌కు, థర్డ్ పార్టీ కంట్రోల్ ఎస్యూరెన్స్‌కు నోటీసులు జారీ చేశారు.

రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కమిషనర్ నిర్ణయం?

అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు లోపించినట్లు తేలితే పెనాల్టీతో పాటు అక్కడ తిరిగి పనులు ప్రారంభించాలని ఆదేశాలు ఉన్నాయి. కాని నగర పాలక సంస్థ, రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కొత్తగా నిర్మించిన రోడ్డులో నాణ్యతా ప్రమాణాలు పాటించని కారణంగా పునర్నిర్మించాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. దీంతో ఇంజినీరింగ్ అధికారులు తలలు పట్టుకున్నంత పనైంది.

పాత డేట్స్‌తో ఎంబుక్ రెడీ?

ఈ విషయంలో కమిషనర్ కీర్తి చేకూరి సీరియస్‌గా ఉన్నారని విషయం తెలుసుకున్న ఇంజినీరింగ్ అధికారులు కాంట్రాక్టర్‌కు మేలు చేకూర్చేందుకు గాను ఇంత వరకు బిల్లులు పెట్టలేదు. పాత డేట్స్‌తో ఎంబుక్ రెడీ చేయాలని ఏఈని ఆదేశించినట్లు సమాచారం. ఆయన పాత డేట్స్‌తో రెడీ చేసినట్లు సమాచారం. అభివృద్ధి పనులపై ఎన్ని ఆరోపణలు వచ్చినప్పటికి వాటిని కప్పి పుచ్చుకోవడంలో ఇంజినీరింగ్ అధికారులకు సాటి లేరనే చెప్పుకోవచ్చు.

> **నాణ్యత పాటించలేదని తేలింది**
>
> జీటీ రోడ్డు సినీ ప్రైమ్ థియేటర్ పక్కన వేసిన రోడ్డులో నాణ్యత ప్రమాణాలు పాటించలేదని తేలింది. కమిషనర్ ఆదేశాలు మేరకు ఇంజినీరింగ్ అధికారులతో పాటు కాంట్రాక్టర్ కూడా నోటీసులు జారీ చేశాం. – పి.వి.కె. భాస్కర్, ఎస్ఈ

జీజీహెచ్ ఇన్‌చార్జి ఏడీగా పాల్ సుధాకర్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ ఇన్‌చార్జి అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)గా బి.పాల్ సుధాకర్‌ను నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ వి.రామిరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఏడీగా పనిచేస్తున్న చింతలపూడి నాగేశ్వరరావును సస్పెండ్ చేయడంతో పాల్ సుధాకర్‌ను ఇన్‌చార్జి ఏడీగా నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పేదల సొంతింటి కల జగనన్నతోనే సాధ్యం

- ఎమ్మెల్యే మేకతోటి సుచరిత
- అడవితక్కెళ్లపాడు, స్వర్ణభారతీనగర్‌లో 752 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ



పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుచరిత, కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి

గుంటూరు రూరల్: పేదల సొంతింటి కల జగనన్నతోనే సాధ్యమని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. 41వ డివిజన్ స్వర్ణభారతీనగర్‌లో మంగళవారం దాక్షిణ్య విద్యాసంస్థల ఆవరణలో ఏర్పాటు చేసిన పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీలో ఆమె, కలెక్టర్ ఎం. వేణుగోపాల్‌రెడ్డి, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడులతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న మహిళల సొంతింటి కలను నిజం చేశారని, సాధికారత కోసం అన్ని సంక్షేమ పథకాల్ని వారి పేరుతోనే అందిస్తున్నారని తెలిపారు. కోర్టు కేసుల వల్ల అడవితక్కెళ్లపాడు గ్రామస్తులకు ఇళ్ల పట్టాల పంపిణీ జరగలేదని, ప్రస్తుతం ప్రత్యామ్నాయ స్థలాల్ని సేకరించి అందిస్తున్నామని పేర్కొన్నారు. ఒక్కొక్కరికీ రూ. 7 లక్షల విలువచేసే ఇంటి పట్టాలను అందిస్తున్నామని చెప్పారు. ఇల్లు కట్టుకోవడానికి ముందుకు వచ్చిన వారికి నిధులు కూడా మంజూరు చేస్తున్నట్లు వివరించారు. కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా, అత్యంత పారదర్శకంగా పేదలదరికీ ఇళ్ల పథకంలో జిల్లాలో దాదాపు 1.50 లక్షల మందికి స్థలాల్ని పంపిణీ చేసినట్లు వెల్లడించారు. దీని కోసం ప్రభుత్వంతో పాటు, ప్రైవేటు భూముల్ని రూ. 1451 కోట్లతో కొనుగోలు చేసినట్లు తెలిపారు. వీటిలో కోర్టు కేసుల కారణంగా 1400 మందికి పట్టాలు పంపిణీ చేయడం నిలిచిపోయిందన్నారు. వీరికి ప్రత్యామ్నాయ స్థలాలు సేకరించి ప్రస్తుతం అడవితక్కెళ్లపాడుకు చెందిన 752 మందికి పట్టాల్ని పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. నగరపాలక సంస్థ మేయర్ కావటి శివనాగమనోహర్‌నాయుడు మాట్లాడుతూ పట్టాలు అందుకున్న వారు వెంటనే నిర్మాణాల్ని ప్రారంభించాలని సూచించారు. అనంతరం లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేశారు. దాక్షిణ్య విద్యాసంస్థలలోని విభిన్న ప్రతిభావంతులు స్వయంగా తయారు చేసిన దీపావళి ప్రమిదలను జిల్లా కలెక్టర్‌కు, ఎమ్మెల్యేకు, మేయర్‌కు అందించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డెప్యూటీ మేయర్ సజీల, కార్పొరేటర్ స్మిత పద్మజ, ఆర్ అండ్ బీ కార్పొరేషన్ డైరెక్టర్ మేరి, గుంటూరు పశ్చిమ మండల తహసీల్దారు సాంబశివరావు, ప్రజా ప్రతినిధులు, కార్పొరేషన్ల డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ నియామకం

చిలకలూరిపేట టౌన్: పల్నాడు జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీని నియమించినట్లు ఏపీస్టేట్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు డాక్టర్ ప్రతాప్ సిన్హా చెప్పారు. పట్టణంలోని ఏసుక్రీస్తు దివ్యశాంతి నిలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో కమిటీ జనరల్ సెక్రటరీగా జె జయరావు, ఎగ్జిక్యూటివ్ అడ్మిస్ట్రేటర్‌గా జె చక్రవర్తి, ట్రెజరర్‌గా టి రత్నకుమార్, బోర్డు సభ్యులు 32 మందికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీని పల్నాడు జిల్లా ఫెలోషిప్ అధ్యక్షుడు నందమూరి క్రిస్టర్ అభినందించారు.

బాస్కెట్ బాల్ టోర్నీ విన్నర్ ఆర్‌వీఆర్‌జేసీ కళాశాల



విజేతలతో కళాశాల యాజమాన్యం

రన్నర్‌గా ధనలక్ష్మి ఫిజికల్ ఎడ్యుకేషనల్ కాలేజీ

గుంటూరు రూరల్: క్రీడా రంగంలో ప్రపంచ దేశాల్లో భారతదేశ కీర్తిని చాటే విధంగా విద్యార్థులు రాణించాలని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్ తెలిపారు. చౌడవరంలోని కళాశాలలో నిర్వహిస్తున్న ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంటర్ కాలేజియేట్ బాస్కెట్ బాల్ (మెన్ అండ్ ఉమెన్) టోర్నమెంట్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. చివరి రోజు ఫైనల్‌కి చేరిన జట్ల మధ్య పోటీ హోరాహోరీగా సాగింది.


బాలుర విభాగంలో...

ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల జట్టు ప్రథమ స్థానంలో నిలిచి విన్నర్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ధనలక్ష్మి ఫిజికల్ ఎడ్యుకేషనల్ కాలేజీ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి రన్నర్ ట్రోఫీని, గెలుచుకుంది. ఏసీ కాలేజీ జట్టు తృతీయ బహుమతిని సాధించింది.

బాలికల విభాగంలో..

ధనలక్ష్మి ఫిజికల్ ఎడ్యుకేషనల్ కళాశాల జట్టు ప్రథమ స్థానంలో నిలిచి విన్నర్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ప్రభుత్వ ఉమెన్స్ కళాశాల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి రన్నర్ ట్రోఫీని, వాగ్దేవీ డిగ్రీ కళాశాల జట్టు తృతీయ బహుమతిని సాధించింది. విజేతలకు కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభలో బహుమతులు, సర్టిఫికెట్లు, ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షుడు మాట్లాడుతూ క్రీడల్లో జయాపజయాలు సహజమని, నైపుణ్యతను పెంచుకునేందుకు క్రీడాకారులు కృషి చేయాలని సూచించారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె. కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఐక్యతతో, మనోస్థైర్యంతో ముందుకు సాగితే ఎటువంటి విజయాన్నైనా సులభతరంగా సాధించవచ్చనే సందేశాన్ని క్రీడలు తెలియజేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్, డైరెక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, ఏఎన్‌యూ యోగా కో–ఆర్డినేటర్ సూర్యనారాయణ, కళాశాల పీడీ పి.గౌరీశంకర్, ఎం. శివరామకృష్ణ పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్‌గా డాక్టర్ విజయ్



గుంటూరు మెడికల్: ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్‌గా డాక్టర్ విజయ్‌ప్రకాష్ నియమితులయ్యారు. ఆయన జిల్లాలోని పెదకాకాని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న డాక్టర్ నాగళ్ల జయరామకృష్ణ పదవీ కాలం మూడేళ్లు పూర్తయింది. బుధవారం డాక్టర్ విజయప్రకాష్ బాధ్యతలు స్వీకరించనున్నారు. మూడేళ్ల పాటు విధుల్లో ఉంటారు.

విద్యుత్ షాక్‌తో అరటి గెలల లోడింగ్ కూలీ మృతి

కొల్లూరు: విద్యుత్‌షాక్‌కు గురై అరటి గెలలు లోడింగ్ చేసే కూలీ మృతి చెందిన సంఘటన మండలంలోని చిలుమూరు కరకట్ట వద్ద మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. దుగ్గిరాల మండలం రేవేంద్రపాడుకు చెందిన మెండితోక పాములు (50) అదే గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులతోపాటు, కుమారుడు, అన్న కుమారుడితో కలిసి అరటి గెలల లోడింగ్ కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. చిలుమూరు కరకట్ట దిగువన ఉన్న తోటలో అరటి గెలలు లోడింగ్ చేసిన అనంతరం మరో తోటలో చేసేందుకు లారీ సహా పయనమయ్యారు. అదే సమయంలో కొంతమంది కూలీలు లారీ క్యాబిన్‌లో కూర్చోగా, పాములు కుమారుడు స్టీఫెన్, అన్న కుమారుడు యోహాన్, మరో వ్యక్తితో కలసి లోడ్ చేసిన అరటి గెలలపై కూర్చుని ప్రయాణిస్తున్నాడు. అదే సమయంలో విద్యుత్తు తీగలు పాములుకు తగలడంతో అతనితోపాటు, కుమారుడు, అన్న కుమారుడు షాక్‌కు గురయ్యారు. పక్కన ఉన్న వ్యక్తి లారీపై నుంచి దూకి ప్రమాదం నుంచి తప్పించుకోగలిగాడు. నేరుగా విద్యుత్తు తీగలు తగిలిన పాములు అక్కడికక్కడే మృతి చెందగా, అతని కుమారుడు స్టీఫెన్, అన్న కుమారుడు యోహాన్‌లు తీవ్ర గాయాల బారిన పడటంతో స్థానికులు తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వ్యవసాయ అభివృద్ధికి ఎన్జీరంగా అవిరళ కృషి



ఎన్జీ రంగా విగ్రహం వద్ద యలమంచిలి శివాజీ, విష్ణువర్ధన్ తదితరులు



ఎన్జీ రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ న్యాయమూర్తి లావు నాగేశ్వరరావు

- వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి శారద జయలక్ష్మి
- ఘనంగా 123వ జయంతి వేడుకలు



యూనివర్సిటీలో ఆచార్య ఎన్జీరంగా విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న అధికారులు

గుంటూరు రూరల్: దేశంలో వ్యవసాయ అభివృద్ధికి నిర్మాణాత్మకమైన సూచనలు చేసి, రైతుల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు ఆచార్య ఎన్జీరంగా అని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ ఆర్. శారదజయలక్ష్మి కొనియాడారు. నగర శివారుల్లోని లాంఫాం నందున్న విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో మంగళవారం ఆచార్య ఎన్జీరంగా 123వ జయంతి వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 60 ఏళ్ల పాటు ప్రముఖ పార్లమెంటేరియన్‌గా ఎన్జీరంగా గుర్తింపు పొందారని తెలిపారు. ఆయన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం 1991లో పద్మవిభూషణ అవార్డును అందజేసినట్లు గుర్తు చేశారు. 1996లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏపీ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ఆచార్య ఎన్జీరంగా నామకరణం చేసిందని వివరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ జి.రామారావు, రీసెర్చ్ డైరెక్టర్ ఎల్. ప్రశాంత్, ఎక్స్‌టెన్షన్ డైరెక్టర్ పి.సుబ్బరామిరెడ్డి, ఇంజినీరింగ్ డీన్ ఎ. మణి, ఎస్టేట్ ఆఫీసర్ పి.రవి పాల్గొన్నారు.

రంగా స్ఫూర్తితో విలువలకు కట్టుబడాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ఆచార్య ఎన్జీ రంగా స్ఫూర్తితో రాజకీయాల్లో విలువల పరిరక్షణకు నడుం బిగించాలని రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీ పేర్కొన్నారు. మంగళవారం ఎన్జీ రంగా 124వ జయంతి సందర్భంగా బృందావన్ గార్డెన్స్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ నాడు త్యాగాల కాలమని, ప్రస్తుతం భోగాల కాలంగా మారిందన్నారు. రంగా స్ఫూర్తితో నాడు తామంతా విలువలకు కట్టుబడి ఆయన బాటలో నడిచామని, అదే స్ఫూర్తితో ప్రస్తుత ప్రజా ప్రతినిధులు ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కిసాన్ ఫౌండేషన్ సభ్యులు కల్లూరి మురళీధరరావు, సూరయ్య చౌదరి, కరుణాకరబాబు, అత్తోట సుబ్బారావు, అంకినీడు, జీవీ సత్యనారాయణ, అంకారావు, పాటిబండ్ల విష్ణువర్ధన్ పాల్గొన్నారు

పొన్నూరులో..

పట్టణంలో రంగా ట్రస్ట్ నిర్వాహకులు రామినేని కిశోర్‌బాబు ఆధ్వర్యంలో మంగళవారం రైతు ఉద్యమ నేత ఆచార్య ఎన్.జి.రంగా 123వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి లావు నాగేశ్వరరావు, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు పాల్గొన్నారు. సెంటర్‌లోని రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జీబీసీ రోడ్డులోని రంగా, భారతీదేవి సమాధుల వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, జిల్లా వ్యవసాయ మండలి డైరెక్టర్ బొద్దులూరి రంగారావు, వెలగా సుబ్బారావు, షేక్ అబ్దుల్ జలీల్, ఆకుల జానకీబాబు, గేరా సుబ్బయ్య, నన్నపనేని మధుకర్, గోగినేని వెంకయ్య చౌదరి పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
గుంటూరు
బుధవారం ॥ 8-11-2023

'ఆసక్తి ఉంటే అనంత విశ్వాన్ని మథించవచ్చు' అనడానికి ప్రతీక శకుంతలాదేవి. అరవై దాటిన తర్వాత యూ ట్యూబర్‌గా ప్రపంచానికి పరిచయమయ్యారు. అంతకంటే ముందు ఆమె తనకంటూ ఓ ప్రపంచాన్ని సృష్టించుకున్నారు. ఆ ప్రపంచంలో సంగీతం, సాహిత్యం, మొక్కల పెంపకం ఉన్నాయి. ఇప్పుడు డిజిటల్ మీడియా వేదికగా సృజనాత్మకతను పంచుతున్నారు. భర్త బాటలో తాను కూడా మరణానంతరం దేహాన్ని డొనేట్ చేశారు.

అర్థవంతమైన జీవితం



శకుంతలాదేవి

శకుంతలాదేవి అత్యంత సాధారణ గృహిణి. నలుగురు పిల్లల్ని పెంచుతూ ఆమె తన అభిరుచులను కొనసాగించారు. సాహిత్యాన్ని ఆస్వాదించకుండా ఉట్టిగా పాటలు వినడంలో ఏదో అసంతృప్తి. అందుకే హిందీ పాటల సాహిత్యాన్ని అర్థం చేసుకోవడానికి హిందీ– తెలుగు డిక్షనరీలో అర్థాలు వెతుక్కున్నారు. స్మార్ట్‌ఫోన్, సోషల్ మీడియాలను ఉబుసుపోని పోస్టులకు పరిమితం చేయలేదామె. సాంకేతిక పాఠాలను స్మార్ట్‌ఫోన్‌తోనే నేర్చుకున్నారు. వీడియో రికార్డ్ చేయడం, ఎడిటింగ్, థంబ్‌నెయిల్ పెట్టడం, యూ ట్యూబ్‌లో అప్‌లోడ్ చేయడం వరకు అవసరమైనవి అన్నీ సొంతంగా నేర్చుకున్నారు. తనకు తెలిసిన మంచి విషయాలను డిజిటల్ మీడియా వేదికగా ప్రపంచంతో పంచుకుంటున్నారు. 'నన్ను ప్రపంచానికి తెలియచేసిన యూట్యూబ్‌కి తొలుత కృతజ్ఞతలు' అంటూ తన వివరాలను 'సాక్షి'తో పంచుకున్నారు స్వర్ణ శకుంతలాదేవి.

ఆధ్యాత్మికం నుంచి అభ్యుదయం వరకు ...

''మాది తెనాలి దగ్గర మూల్పూరు గ్రామం. నాన్న వ్యవసాయంతోపాటు గుడిలో పూజలు చేసేవారు. ఏడుగురు సంతానం. ఐదుగురు అమ్మాయిల్లో ఎస్‌ఎస్‌ఎల్‌సీ వరకు చదివింది నేనే. మా వారు బీఏఎమ్‌ఎస్ చదువుతూ ఉండడంతో ఆయన చదువు పూర్తయ్యే వరకు, నాకూ చదువుకునే అవకాశం వచ్చింది. ఫిఫ్త్‌ఫారమ్‌లో ఉండగా పెళ్లయింది. తర్వాత పుట్టింట్లోనే ఉండి ఎస్‌ఎస్‌ఎల్‌సీ పూర్తి చేసి రిజల్ట్స్ వచ్చే నాటికి చీరాలలో అత్తగారింటిలో ఉన్నాను. అప్పట్లో ఆ చదువుకే సెకండరీ గ్రేడ్ టీచర్ ఉద్యోగం ఇచ్చేవారు. మా అత్తగారు 'ఉద్యోగం చేయాల్సిన అవసరం ఏముందిప్పుడు' అనడంతో ఇంటికే పరిమితమయ్యాను. టీచర్ అయ్యే అవకాశం అలా చేజారింది. కానీ మా వారి నుంచి ప్రోత్సాహం మాత్రం ఎప్పుడూ ఉండేది. ఆయన ఆయుర్వేద వైద్యులుగా ఒంగోలు దగ్గర అమ్మనబ్రోలులో ప్రాక్టీస్ చేసేవారు. అక్కడే 35 ఏళ్ల పాటు ఉన్నాం. ఇద్దరు పిల్లలు పుట్టిన తరవాత వీణ నేర్చుకున్నాను. ఆ తర్వాత మరో ఇద్దరు పిల్లలు. వాళ్లందరి ఆలనపాలన చూస్తూ నా అభిరుచులను కొనసాగించగలిగాను. ఆధ్యాత్మిక గ్రంథాల నుంచి రంగనాయకమ్మ రాసిన బలిపీఠం, కౌసల్యాదేవి– చక్రవాకం, రవీంద్రనాథుని గీతాంజలి, బాలగంగాధర తిలక్ అమృతం కురిసిన రాత్రి.. ఇలా అదీ ఇదీ అనే వర్గీకరణ లేకుండా చదివేదాన్ని. యద్దనపూడి, మాదిరెడ్డి, యండమూరి, శ్రీశ్రీ రచనలను, అబ్దుల్‌కలామ్ వంటి ప్రముఖుల జీవిత చరిత్రలను ఇష్టంగా చదివాను. కొన్ని రచనలు రేడియోలో నాటికలుగా వచ్చేవి. వాటి కోసం రేడియోకి అంకితమయ్యేదాన్ని. ఇలా సాగుతున్న జీవితంలో పిల్లలు నలుగురూ సెటిల్ అయిన తర్వాత మా వారు ప్రాక్టీస్ చాలించారు. 2005లో చీరాలకు వచ్చాం.

పెద్దబ్బాయి కొత్తదారిలో నడిపించాడు

మా పెద్దబ్బాయి నన్ను కొత్తగా ఆవిష్కరించాడు. తను మెకానికల్ ఇంజనీర్. తాను ఆసక్తి కొద్దీ జెమాలజీ కోర్సు చేశాడు. రత్నాల గురించిన కబుర్లు నాకు ఎక్కువ ఆసక్తినివ్వడంతో రత్నాలకు – రాళ్లకు మధ్య తేడాను గుర్తించడం నేర్పించాడు. ముత్యాలు, పగడాలతోపాటు రకరకాల బీడ్స్, జెమ్స్, సెమీ ప్రెషియస్ స్టోన్స్‌తో ఆర్నమెంట్ మేకింగ్ నేర్పించాడు. జీవితాన్ని మనం ఎంత ఉత్సాహవంతంగా, రాగరంజితంగా మార్చుకున్నప్పటికీ ఏదో ఒక వెలితిని సృష్టించి ప్రశ్నార్థకంగా మన ముందు పెడుతుంది. నా అభిరుచులు మాత్రమే నాతో మిగిలాయి, వాటిని ప్రోత్సహించిన మావారు మాకు దూరమయ్యారు. ఆయన కోరిక మేరకు దేహాన్ని వైద్య విద్యార్థుల అధ్యయనం కోసం ఒంగోలులో మెడికల్ కాలేజ్‌కి ప్రదానం చేశాం. ఆయన బాటలో నేను కూడా మరణానంతరం నా దేహాన్ని డొనేట్ చేస్తూ సంతకం చేశాను. మనం జీవిస్తూ మరొకరికి ఉపయోగం కలిగించడమే జీవితానికి అసలైన అర్థం అని నమ్ముతాను. ఆయన జ్ఞాపకాలతో రోజులు సాగుతున్న సమయంలో కోవిడ్ ప్రపంచాన్ని కుదిపేసింది.

యూ ట్యూబ్ ఆత్మీయులనిచ్చింది

కోవిడ్ సమయంలో అగాధంలాంటి విరామం. ఆ విరామం ఎంత కాలమో కూడా తెలియదు. యూ ట్యూబ్ చానెల్స్ చూస్తూ, మా వారు సుబ్రహ్మణ్య కుమార్ రాసిన వైద్య గ్రంథాన్ని చదువుతూ గడిపాను. అప్పుడు నాక్కూడా నాకు తెలిసిన సంగతులు చెప్పాలనిపించింది. గూగుల్ లేని రోజుల్లోనే నిత్యాన్వేషిగా ఎన్నో విషయాలు తెలుసుకున్నాను. చేతిలోకి స్మార్ట్‌ఫోన్ వచ్చిన తర్వాత ఇక కష్టమేముంది? యూ ట్యూబ్‌కి సంబంధించిన పరిజ్ఞానమంతా 'హౌ టూ అప్‌లోడ్, హౌ టూ డూ ఎడిటింగ్, హౌ టూ డూ థంబ్‌నెయిల్' అంటూ 'హౌ టూ' అని అడుగుతూ నేర్చుకున్నాను. మొదట వంటలు, ఇంటి అలంకరణ, మా వారు రాసిన వైద్యగ్రంథంలోని విషయాలను చెప్పాలనుకుని 2021లో యూ ట్యూబ్ చానెల్ మొదలుపెట్టాను. కొంతకాలం తర్వాత యూ ట్యూబ్ గుర్తించాలంటే ఏదో ఒక టాపిక్ మీదనే దృష్టి పెట్టమని సూచించారు పిల్లలు. వంటలు చాలామంది చేస్తున్నారు. ముత్యాలు, పగడాల గురించి చాలామందికి తెలియని సంగతులు చాలా ఉన్నాయి. వాటి గురించి చెప్పమన్నారు మా పిల్లలు. ఆ తర్వాత నాకు సబ్‌స్క్రైబర్స్ రెండున్నర లక్షలకు పెరగడంతోపాటు ఫాన్ ఫాలోయింగ్ కూడా పెరిగింది. డాక్టర్‌లు, సైంటిస్ట్‌లు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌లు... సందేహాలడుగుతుంటే నాకు తెలిసినదెంత? ఇంత పెద్ద చదువులు చదువుకున్న వాళ్ల సందేహాలు నేను తీర్చడమేమిటని ఆశ్చర్యంగా ఉంటుంది కూడా. అసలు ముత్యాన్ని, నకిలీ ముత్యాన్ని ఎలా గుర్తించాలి, తైవాన్ పగడం ఎలా ఉంటుంది, ఇటాలియన్ పగడాలెలా ఉంటాయి, వేటిని క్యారట్‌లలో తూస్తారు, వేటిని గ్రాముల్లో తూస్తారు... వంటి విషయాలనెన్నో చెప్పాను. యూ ట్యూబర్‌గా నేను డబ్బుకంటే వెలకట్టలేని ఆత్మీయతను, అభిమానాన్ని సంపాదించుకున్నాను. ఆంటీ, అమ్మా అనే పిలుపులతోపాటు ఈ తరం యువతులు వాళ్ల సందేహాల కోసం ఫోన్ చేసి 'అమ్మమ్మా' అని పిలుస్తుంటే చాలా సంతోషంగా ఉంటోంది. మనిషి, మెదడు పని లేకుండా ఖాళీగా ఉండకూడదు. అలాగే ఎంటర్‌టైన్‌మెంట్ మన మైండ్‌ని చెడగొట్టకూడదని నమ్ముతాను. అందుకే టీవీ సీరియల్స్ నన్ను ఆకర్షించలేదు. నాకు నేనుగా సమయాన్ని ఇలా ఆనందంగా, ఉపయుక్తంగా మలుచుకున్నాను'' అన్నారు శకుంతలాదేవి.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

కళ

ఆర్ట్ సైంటిస్ట్

ఆర్ట్, ఫ్యాషన్‌ను కలిపి తనదైన కళను ఆవిష్కరించింది ఢిల్లీకి చెందిన పాయల్ జైన్.

ఫ్యాషన్ రంగంలో పేరుగాంచిన పాయల్ జైన్ మంచి ఆర్టిస్ట్ కూడా.

ఆమె తాజా ఎగ్జిబిషన్....సోల్ ఆఫ్ ఏ ఉమెన్.

ఎగ్జిబిషన్‌లో కనిపించే 30 పీస్‌లలో ప్రతి దాంట్లో ఒక ప్రత్యేకత కనిపిస్తుంది. చరిత్ర నుంచి కవిత్వం వరకు ఏదో ఒక అంశ ధ్వనిస్తుంది.

'ఆర్ట్‌లో సైన్స్ ఉంటుంది. సైన్స్‌లో ఆర్ట్ ఉంటుంది' అనే పాయల్ జైన్‌ను ఆర్ట్ సైంటిస్ట్‌గా పిలుచుకోవచ్చు.

ఫ్యాషన్ ఇండస్ట్రీలో తన మూడు దశాబ్దాల ప్రయాణానికి 'సోల్ ఆఫ్ ఏ ఉమెన్' ప్రతిబింబం అంటుంది పాయల్. ఈ ఎగ్జిబిషన్‌లోని ముప్పై పీస్‌లలో ప్రతి పీస్‌కు ఏదో ఒక ప్రత్యేకత ఉంది. మెక్సికన్ పెయింటర్ ఫ్రీదా ఖాలోను స్ఫూర్తిగా తీసుకొని 'ఫర్‌బిడెన్ లవ్' కలెక్షన్ రూపొందించింది. పాయల్ అభిమానించే ఖాలో పెయింటర్, మ్యాజికల్ సర్రియలిస్ట్, ఫెమినిస్ట్, రెవల్యూషనరీ.

పాయల్ ఆర్కిటెక్చర్ నుంచి ఫ్యాషన్ రంగంలోకి రావడానికి కారణం చిత్రకళ పట్ల తనకు ఉన్న అనురక్తి. స్కెచ్చింగ్ తనకు ఇష్టమైన పని. ఆమె తల్లి కూడా ఆర్టిస్టే. సితార్ అద్భుతంగా వాయించేది. తన కలల గురించి తల్లిదండ్రులకు చెప్పినప్పుడు ' ఏదో ఒక డిగ్రీ నీ చేతిలో కనిపించాలి. ఆ తరువాతే ఏదైనా' అన్నారు. అలా బీకామ్ పూర్తి చేసింది.



పాయల్ స్కెచ్చింగ్ నైపుణ్యాన్ని చూసి 'నువ్వు ఫ్యాషన్ ఇండస్ట్రీలో ప్రయత్నించవచ్చు' అని సలహా ఇచ్చారు సన్నిహితులు. మొదట ఫ్యాషన్ ఇండస్ట్రీకి సంబంధించి పుస్తకాలు, మ్యాగజైన్స్ విరివిగా చదివేది. అలా ఫ్యాషన్ కూడా తన ప్యాషన్‌గా మారింది. శాన్‌ఫ్రాన్సిస్కోలో ఫ్యాషన్ డిజైనింగ్ చేసింది.

'ఫ్యాషన్‌కు ఆర్ట్, సైన్స్ అనే రెండు కోణాలు ఉంటాయి. ఆర్ట్ అనేది సృజనాత్మకతకు సంబంధించిన కోణం, సైన్స్ అనేది సాంకేతిక నైపుణ్యానికి సంబంధించిన కోణం. ఫ్యాషన్ డిజైనింగ్ కోర్స్ నా దృష్టిని విశాలం చేసింది. ప్యాటర్న్‌మేకింగ్, డ్రాపింగ్, గ్రేడింగ్, ఇలస్ట్రేషన్, ఫ్యాషన్ మార్కెటింగ్...ఇలా ఎన్నో విషయాలను తెలుసుకున్నాను' అంటున్న పాయల్



సోల్ ఆఫ్ ఏ ఉమెన్

ఎన్నో కార్పొరేట్ హోటల్స్‌కు ఆకట్టుకునేలా 'హోటల్ యూనిఫామ్'ను డిజైన్ చేసి ఇచ్చింది.

'డిజైనర్స్ అంటే గొప్ప ఏమీ కాదు. గ్లోరిఫైడ్ టైలర్స్ మాత్రమే' అని చాలా మంది అనుకొని అపోహపడే కాలంలో డిజైనర్‌గా కెరీర్ ప్రారంభించింది పాయల్. ఆమె వెస్ట్రన్ క్లాతింగ్ మొదలుపెట్టినప్పుడు దానికి మార్కెట్ లేదు. అయితే ఆ తరువాత మాత్రం పరిస్థితిలో మార్పు వచ్చింది.

పాయల్ సక్సెస్ మంత్రా ఏమిటి?

ఆమె మాటల్లోనే చెప్పాలంటే...

'చేయాలి కాబట్టి చేస్తున్నాం అనే ధోరణిలో కాకుండా మనం చేస్తున్న పనిని మనసారా ప్రేమించాలి. నిద్ర, శ్వాస, కలలో మన లక్ష్యం కనిపించాలి. ఫెయిల్యూర్‌కు చోటివ్వకుండా సాంకేతిక జ్ఞానంపై గట్టి పట్టు సంపాదించాలి. ఎప్పటికప్పుడు మన ఆలోచనల్లో కొత్తదనం వచ్చేలా చూసుకోవాలి. ప్రశంసలు ఆస్వాదించడానికి మాత్రమే పరిమితమైపోకుండా అన్ని కోణాల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలి. మార్పులు చేర్పులు చేసుకోవాలి. సానుకూల శక్తి, సంకల్పబలం ఎప్పటికీ మనకు తోడుగా ఉండాలి'

కెరీర్ తొలి రోజుల్లో తాను ఎదుర్కొన్న ఆటుపోట్లను ఇప్పటికీ గుర్తు పెట్టుకుంటుంది పాయల్. చేదుజ్ఞాపకాలుగా కాదు...ఆ సమయంలోనూ తాను ఎంత ధైర్యంగా ఉందో మళ్లీ మళ్లీ గుర్తు తెచ్చుకోవడానికి.

'విజయం ధైర్యవంతులను వెదుక్కుంటూ వస్తుంది' అని చెప్పడానికి ఫ్యాషన్ ఇండస్ట్రీలో ఆమె తెచ్చుకున్న పేరే నిదర్శనం.

సినిమా

ప్రతి కణం కణం...



సల్మాన్ ఖాన్, కత్రినా కైఫ్

టైగర్, జోయాల ప్రేమ బలమైనది. ప్రేయసి మీద తనకున్న ప్రేమను వ్యక్తపరచడానికి 'మెరిసే నీ కనులే.. ముసిరే నీ కనులే..', 'ప్రతి కణం.. కణంలో...' అంటూ పాట అందుకున్నారు టైగర్. యశ్ రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్‌లో భాగంగా రూపొందిన 'టైగర్ జిందా హై'కి సీక్వెల్‌గా రూపొందిన 'టైగర్ 3'లోని పాట ఇది. టైగర్‌గా సల్మాన్ ఖాన్, జోయాగా కత్రినా కైఫ్ నటించగా మనీష్ శర్మ దర్శకత్వంలో ఆదిత్య చోప్రా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రంలోని రెండో పాట 'ప్రతి కణం కణం..'ను మంగళవారం రిలీజ్ చేశారు. ''ఈ పాట టైగర్, జోయాల అన్యోన్యతను ఆవిష్కరించే విధంగా ఉంటుంది. ఆ కెమిస్ట్రీని సిల్వర్ స్క్రీన్‌పై చూసి, అనుభూతి చెందాల్సిందే. అందుకే వీడియోను ముందుగా రిలీజ్ చేయలేదు'' అన్నారు ఆదిత్యా చోప్రా. ఈ చిత్రం ఈ నెల 12న రిలీజ్ కానుంది.

యాత్రలో జర్మనీ నటి సుజానే



'యాత్ర' ఫేమ్ మహి వి. రాఘవ్ దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం 'యాత్ర 2'. ఇందులో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి పాత్రలో మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాత్రలో హీరో జీవా నటిస్తున్నారు. త్రీ ఆటమ్ లీవ్స్, వీ సెల్యూలాయిడ్, శివ మేక నిర్మిస్తున్న 'యాత్ర 2' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. కాగా ఈ సినిమాలో సోనియా గాంధీ పాత్రని జర్మనీ నటి సుజానే బెర్నెర్ట్ పోషిస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ మేరకు ఆమె పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మంగళవారం రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా మహి వి. రాఘవ్ మాట్లాడుతూ–''యాత్ర'కి కొనసాగింపుగా 'యాత్ర 2' రూపొందుతోంది. వైఎస్ జగన్‌గారు ప్రజా నాయకుడిగా ఎదిగిన తీరుని, 2009 నుంచి 2019 వరకు ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన రాజకీయ ఘటనలను ఈ చిత్రంలో చూపిస్తున్నాం. 'యాత్ర 2'ని 2024 ఫిబ్రవరి 8న రిలీజ్ చేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: మధి, సంగీతం: సంతోష్ నారాయణన్.

నా తలరాతే రంగుల రంగోలి...



మహేశ్‌బాబు

మహేశ్‌బాబు అభిమానుల్లో దీపావళి పండగ సంబరం ఆరంభమైంది. జోష్‌గా పండగ చేసుకునేలా మహేశ్‌బాబు హీరోగా రూపొందుతున్న తాజా చిత్రం 'గుంటూరు కారం' నుంచి 'దమ్ మసాలా...' పూర్తి పాటను విడుదల చేశారు. ఈ చిత్రదర్శకుడు త్రివిక్రమ్ పుట్టినరోజు (నవంబర్ 7) సందర్భంగా మంగళవారం ఈ పాటను రిలీజ్ చేశారు. చిత్ర సంగీతదర్శకుడు తమన్ స్వరపరచిన ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా సంజిత్ హెగ్డే, జ్యోతి నూరన్ ఆలపించారు. ''నా తలరాతే రంగుల రంగోలి.. దిగులైనా చేస్తా దీవాలి.. నా నవ్వుల కోటని నేనే ఎందుకు పడగొట్టాలి', 'నేనో నిశ్శబ్దం.. అనునిత్యం నాతో నాకే యుద్ధం' అంటూ సాగే ఈ పాట హీరో పాత్ర తీరుని తెలియజేసే విధంగా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది. మహేశ్ సరసన శ్రీలీల కథానాయికగా, మీనాక్షీ చౌదరి, జగపతిబాబు, జయరామ్, ప్రకాశ్‌రాజ్, రమ్యకృష్ణ తదితరులతో ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే సంక్రాంతికి విడుదల కానుంది.

దీపావళి మనసుని హత్తుకుంటుంది – 'స్రవంతి' రవికిశోర్



''ఇప్పుడు ప్రేక్షకులు పెద్ద చిత్రాలతో పాటు చిన్న సినిమాలు కూడా చూస్తున్నారు. మా 'దీపావళి' చిన్నదైనా అందమైన సినిమా. ఇందులోని భావోద్వేగాలు ప్రేక్షకుల మనసులను హత్తుకుంటాయి'' అని నిర్మాత 'స్రవంతి' రవికిశోర్ అన్నారు. పూ రాము, కాళీ వెంకట్ ప్రధాన పాత్రల్లో ఆర్‌ఏ వెంకట్ దర్శకత్వం వహించిన తమిళ చిత్రం 'కీడా' (తెలుగులో 'దీపావళి'). కృష్ణ చైతన్య సమర్పణలో 'స్రవంతి' రవికిశోర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న తెలుగు, తమిళ భాషల్లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా 'స్రవంతి' రవికిశోర్ మాట్లాడుతూ– ''నిర్మాతగా 38 ఏళ్ల జర్నీలో దాదాపుగా నేను చేసిన సినిమాలన్నీ సంతృప్తినిచ్చాయి. నేను డబ్బుల గురించి ఆలోచించను. ప్రేక్షకులకు సినిమా కనెక్ట్ అవుతుందా? లేదా అని మాత్రమే ఆలోచిస్తా. కథ పూర్తయ్యాకే సినిమాని సెట్స్ మీదకు తీసుకెళతాను. ఓ సినిమా పూర్తయ్యాకే మరొకటి చేస్తాను. నేను తక్కువ సినిమాలు చేయడానికి కారణం అదే. 'దీపావళి' కథని ప్రాణం పెట్టి రాశాడు వెంకట్. చెప్పిన కథను చెప్పినట్లు స్క్రీన్ మీదకు తీసుకొచ్చాడు. మా సినిమా ఇండియన్ పనోరమాకి ఎంపికవడం గొప్ప అనుభూతి. చెన్నై ఫిల్మ్ ఫెస్టివల్‌లోనూ ప్రదర్శించడం సంతోషంగా ఉంది. ఇక రామ్ హీరోగా ఓ సినిమా చేసేందుకు స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. అలాగే రామ్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ సినిమా చేయాలని ఉంది. ఇందుకు సరైన కథ కుదరాలి'' అన్నారు.

జపాన్‌లో నటిగా కనిపిస్తాను




అనూ ఇమ్మాన్యుయేల్

''జపాన్' వైవిధ్యమైన చిత్రం. చాలా క్రేజీగా ఉంటుంది. ఈ దీపావళికి పర్ఫెక్ట్ ఫిల్మ్ ఇది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుంది. తప్పకుండా అందరూ థియేటర్స్‌లోనే చూడాలి'' అని హీరోయిన్ అనూ ఇమ్మాన్యుయేల్ అన్నారు. కార్తీ, అనూ ఇమ్మాన్యుయేల్ జంటగా రాజు మురుగన్ దర్శకత్వం వహించిన చిత్రం 'జపాన్'. ఎస్ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మించిన ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో ఈ నెల 10న రిలీజవుతోంది. తెలుగులో అన్నపూర్ణ స్టూడియోస్ రిలీజ్ చేస్తోంది. ఈ సందర్భంగా అనూ ఇమ్మాన్యుయేల్ మాట్లాడుతూ– ''రాజు మురుగన్‌గారి సినిమాలు వైవిధ్యంగా ఉంటాయి. అలాగే 'జపాన్' కూడా. ఈ చిత్రంలో ఓ నటిగా కనిపిస్తా. నా పాత్ర జపాన్ (కార్తీ) లైఫ్‌లో కీలకంగా ఉంటుంది. ఇక ఫలానా పాత్ర చేయాలనే కలలు నాకు లేవు. ప్రేక్షకులు ఇష్టపడే పాత్రలు చేయాలని ఉంది'' అన్నారు.

వారి మాటలే నాలో స్ఫూర్తి నింపాయి – సురేష్ కొండేటి

''సంతోషం' సినీ వారపత్రిక ప్రారంభోత్సవం సందర్భంగా 'ఫిల్మ్ ఫేర్' అవార్డుల్లాగా సంతోషం అవార్డులు ఇస్తే బాగుంటుందని నాగార్జునగారు అన్నారు. దీంతో 'సంతోషం సౌత్ ఇండియన్ ఫిల్మ్ అవార్డ్స్'ని ప్రతి ఏటా ఇస్తున్నాను. అలాగే నన్ను నిర్మాతగా చూడాలని చిరంజీవిగారు అనడంతో నిర్మాత అయ్యాను. వారిద్దరి మాటలు నాలో స్ఫూర్తి నింపడంతో ఇప్పుడు ఈ స్థాయిలో ఉన్నాను'' అని నిర్మాత, 'సంతోషం' సినీ వారపత్రిక అధినేత సురేష్ కొండేటి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ– ''ఈ నెల 18న హైదరాబాద్‌లో 'సంతోషం ఓటీటీ అవార్డ్స్'ని ఇస్తున్నాం. డిసెంబరు 2న గోవాలో 'సంతోషం సౌత్ ఇండియన్ ఫిల్మ్ అవార్డ్స్' వేడుకను ఘనంగా నిర్వహించనున్నాం. ఈ వేడుకకు తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ చిత్ర పరిశ్రమకు చెందిన నటీనటులు, సాంకేతిక నిపుణులు హాజరవుతారు. సంతోషం అవార్డ్స్‌ని 25ఏళ్ల పాటు కొనసాగించాలనుకున్నాను. ఇప్పటికి 22 ఏళ్లయింది. ఇంకో మూడేళ్లు కచ్చితంగా అవార్డ్స్ ఫంక్షన్ నిర్వహిస్తాను. మరోవైపు సినిమాలు నిర్మిస్తున్నాను. నటుడిగా ఐదారు సినిమాల్లో కీ రోల్స్ చేస్తున్నాను'' అన్నారు.



లవ్.. థ్రిల్...

హృతిక్ శౌర్య హీరోగా వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్రలో రూపొందుతోన్న చిత్రం 'అశ్వత్థామ'. 'హతః అశ్వత్థామ' అనేది ఉపశీర్షిక. చంద్రశేఖర్ ఆజాద్ పాటిబండ్ల దర్శకత్వంలో ఈ చిత్రాన్ని ఫ్లిక్‌నైన్ స్టూడియో సంస్థ నిర్మిస్తోంది. హృతిక్ శౌర్య బర్త్‌డే సందర్భంగా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. చంద్రశేఖర్ ఆజాద్ మాట్లాడుతూ – ''ఓ టు'తో హృతిక్ హీరోగా కెరీర్ ప్రారంభించారు. అందులో సాఫ్ట్ కుర్రాడిగా కనిపించిన ఆయన 'అశ్వత్థామ'లో కమర్షియల్ హీరోగా కనిపించనున్నారు. ఈ సినిమా కోసం హృతిక్ చేసిన యాక్షన్ సీన్స్ అద్భుతంగా ఉంటాయి. రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే లవ్, క్రైమ్ థ్రిల్లర్ మూవీ ఇది'' అని అన్నారు.



హృతిక్ శౌర్య

పాటల్లో నవరసాలుంటాయి – సుభాష్ ఆనంద్



''అలా నిన్ను చేరి' సినిమాలోని ప్రతీ పాట అద్భుతంగా ఉంటుంది. ఒక్కో పాటను ఒక్కో శైలిలో కంపోజ్ చేసే చాన్స్ నాకు దొరికింది. నవరసాలను చూపించేలా ఇందులోని పాటలుంటాయి'' అని సంగీత దర్శకుడు సుభాష్ ఆనంద్ అన్నారు. దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'అలా నిన్ను చేరి'. మారేష్ శివన్ దర్శకత్వం వహించారు. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న రిలీజవుతోంది. ఈ సందర్భంగా చిత్ర సంగీత దర్శకుడు సుభాష్ ఆనంద్ మాట్లాడుతూ– ''ఫీల్ గుడ్ లవ్ స్టోరీ చిత్రమిది. ప్రేమ కథా చిత్రాలకు సంగీతమే ప్రాణం. నేను చాలా సినిమాలకు సంగీతం అందించాను. అయితే 'అలా నిన్ను చేరి' నా కెరీర్‌కి గుడ్ టర్న్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు.

ఆరుగురి కథ



'టెనెంట్'లో ఓ దృశ్యం

'సత్యం' రాజేశ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'టెనెంట్'. ఇందులో మేఘా చౌదరి హీరోయిన్. వై. యుగంధర్ దర్శకత్వంలో మోగుళ్ళ చంద్రశేఖర్‌రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమా క్యారెక్టర్ ఇంట్రడక్షన్ గ్లింప్స్ వీడియోను విడుదల చేశారు. ఈ సందర్భంగా వై. యుగంధర్ మాట్లాడుతూ– ''జీవితం ఆడే వైకుంఠ పాళిలో ఎంచుకున్న పాచికల్లాంటి ఆరు ముఖ్య పాత్రల మధ్య జరిగే కథే ఈ చిత్రం. ప్రస్తుత అర్బన్ లైఫ్ జీవన శైలిలో మహిళలు ఎంత అప్రమత్తంగా ఉండాలో చెబుతూ తయారు చేసిన ఈ కథ, కథనం ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సాహిత్య సాగర్, కెమెరా: జెమిన్ జోం అయ్యనీత్, సహనిర్మాత: ఎస్. రవీందర్ రెడ్డి.